సాక్షి ఒడిశా

గురువారం । 29 । జూన్ । 2023



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,72,931లు, బంగారం 84.65 గ్రాములు, వెండి 3.8 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



కిక్కిరిసిన భక్తజనం

- 8లో



ఏకామ్ర ప్రాజెక్టుకు శంకుస్థాపన

- 8లో

## న్యూస్‌రీల్

### కటక్ చేరుకున్న కొరాపుట్ జట్టు



కటక్‌లో కొరాపుట్ మహిళా క్రికెట్ జట్టు

జయపురం: ఈనెల 29నుంచి కటక్ బారబాటీ స్టేడియంలో జరుగనున్న అంతర్ రాష్ట్ర మహిళా క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు కొరాపుట్ జిల్లా మహిళా జట్టు బుధవారం కటక్ చేరుకుందని సబ్ డివిజన్ అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి రబి నాయక్ తెలిపారు. ఒడిశా క్రికెట్ అసిసోయేషన్ నిర్వహిస్తున్న ఈ పోటీలు జూలై 4వరకు కొనసాగుతాయన్నారు. 29న ఉదయం మల్కన్‌గిరితో, 30న కెంజొహార్ జట్టుతో, అదే రోజు సాయంత్రం జాజ్‌పూర్‌తో తలపడనుందని వివరించారు. టోర్నీలో జిల్లా జట్టు ఉత్తమ ప్రతిభ చూపి, విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

### దోపిడీ దొంగలు అరెస్ట్

- ద్విచక్రవాహనాలు, మారణాయుధాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు



పోలీసుల అదుపులో నిందితులు, మారణాయుధాలు, వాహనాలు

బరంపురం: జిల్లాలోని హల్దియా పదర్ గ్రామం శివారులో ఇటీవల జరిగిన దోపిడీ ఘటనలో నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 2 బైక్‌లు, స్కూటీ, 2 కత్తులు, 3 బాంబులు సీజ్ చేశారు. దీనిపై ఐఐసీ అధికారి బసంత్‌కుమార్ సెతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 24న నగరానికి సమీపంలోని గొళంతరా పోలీస్ స్టేషన్ పరిధి హల్దియా పదర్ గ్రామానికి చెందిన తపన్ కటవా, భార్య కున్ని కటవా తన తల్లి ఆపరేషన్ నిమిత్తం రూ.3 లక్షలకు పైగా నగదుతో బైక్‌పై బరంపురం వెళ్తున్నారు. దారిలో అడ్డగించిన దోపిడీ దుండగలు నగదు దోచుకొని పరారయ్యారు. దీనిపై బాధితుడు గొళంతరా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి పల్సర్ బైక్-1, స్ప్లెండర్-1, స్కూటీ-1 తో పాటు మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు రుద్రా డకువా, కలియా సాహు, అజయ్ లంకా, పింటు నాయక్‌గా గుర్తించారు.

### యాత్రలో విషాదం


- విద్యుదాఘాతంతో యువకుడి మృతి

జయపురం: కొరాపుట్ జిల్లా కొలాబ్‌నగర్‌లో బుధవారం జరిగిన మారు రథయాత్రలో అపశృతి చోటు చేసుకుంది. రథంపై ఉన్న జెండా విద్యుత్ తీగలకు తగలడంతో ఒక్కసారిగా అదుపు తప్పడంతో చక్రాల కింద పడిన యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కొరాపుట్ సహిద్ లక్ష్మణ నాయక్ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు.. అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. మృతుడు కొలాబ్‌నగరానికి చెందిన బబులా నాయక్(26)గా గుర్తించారు. ప్రమాదంలో విద్యుదాఘాతంతో కృష్ణారావు అనే మరో యువకుడు గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న కొరాపుట్ డిప్యూటీ కలెక్టర్, డిప్యూటీ సెక్యూరిటీ సూపరిండెంట్, బీడీఓ, తహసీల్దార్, పోలీసులు, విద్యుత్‌శాఖ అధికారులు ఘటనా స్థలానికి వెళ్లి, పరిస్థితిని సమీక్షించారు. వాస్తవంగా రథయాత్ర కొనసాగే మార్గంలో విద్యుత్ లైన్లు తొలగించి, సరఫరా నిలిపి వేస్తారు. కొలాబ్‌నగర్‌లో ఈ విధంగా చేయకపోవడం కారణంగానే యువకుడు మృతి చెందాడని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### అభిమానుల సేవా కార్యక్రమాలు

రాయగడ/కొరాపుట్: బీజేడీ కార్యనిర్వాహక కార్యదర్శి ప్రణబ్‌ప్రకాష్ దాస్(బొబి దాస్) పుట్టిన రోజు సందర్భంగా ఆ పార్టీ శ్రేణులు బుధవారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రాయగడలో హోటల్ తేజస్వీలో బిజూ యువ జనతాదళ్ జిల్లా అధ్యక్షుడు దేవాశీస్ ఘడంగ నేతత్వంలో జరిగిన వేడుకలకు ఎమ్మెల్యే మకరంద ముదులి, బీజేడీ జిల్లా అధ్యక్షుడు సుధీర్ దాస్, సీనియర్ నాయకులు బ్రజసుందర్ నాయక్, ఎల్ల కొండబాబు తదితరులు హాజరయ్యారు. కేక్ కట్ చేసి, వద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేపట్టారు. నవరంగ్‌పూర్‌లో డీఆర్‌డీఏ జంక్షన్ వద్ద ఉన్న ప్రభుత్వ దివ్యాంగ ఆశ్రమ కేంద్రంలో ఎమ్మెల్యే సదాశివ ప్రధాన్ కేక్ కట్ చేసి కార్యకర్తలకు, బాలలకు శీతల పానీయాలు, మిఠాయిలు పంపిణీ చేసారు. పొలాల్లో పని చేస్తున్న వ్యవసాయ మహిళా కూలీలకు టార్పాన్లు అందజేశారు. కార్యక్రమాల్లో పార్టీ జిల్లా అదనపు పరిశీలకుడు దేవాశిష్ పాత్రొ తదితరులు పాల్గొన్నారు. కొరాపుట్‌లో బీజేడీ మహిళా నాయకులు మొక్కలు నాటారు.





దేవి సుభద్ర

జగన్నాథుడు

బలభద్రుడు

# బహుడానందం

నవ దినాత్మక యాత్ర నయనానందంగా సాగింది. గుండిచా మందిరంలో గత 9రోజులూ ప్రత్యేక పూజలందుకున్న బలభద్ర, సుభద్ర, జగన్నాథ మూర్తులు.. తమ రథాల్లో ప్రధానాలయం శ్రీమందిరం వైపు కదిలారు. భక్తుల జయ ధ్వానాలు, హరి భోల్, జై జగన్నాథ్ నామస్మరణతో మారు రథయాత్ర.. మార్మోగింది. - భువనేశ్వర్

- ఘనంగా ముగిసిన పూరీ జగన్నాథుని మారు రథయాత్ర
- 3గంటలు ముందుగానే ప్రారంభించిన అధికార వర్గాలు
- రేయంతా రథాలపై దేవుళ్ల దర్శనం
- నేడు స్వర్ణాలంకార దర్శనానికి భారీ ఏర్పాట్లు



రథ శుద్ధి సేవలో పూరీ గజపతి మహారాజా దివ్యసింగ్ దేవ్

శ్రీమందిరం సింహద్వారం ఆవరణలో నిలిచిన మూల విరాట్‌ల రథాలు

గుండిచా ఆలయంలో తొమ్మిది రోజులు కొలువు దీరిన పవిత్ర చతుర్ధా మూర్తులు బలభద్ర, దేవి సుభద్ర, జగన్నాథుడు, సుదర్శనుడితో కలిసి బుధవారం శ్రీమందిరం(ప్రధాన మందిరం)నికి బయలుదేరారు. మారు రథయాత్ర(బహుడా)గా పిలిచే ఈ యాత్రలో పూరీ గజపతి మహారాజా దివ్యసింగ్ దేవ్ తొలి సేవకునిగా చెరా పాంహొరా పూర్తి చేయడంతో రథాలు ఎక్కి దిగేందుకు ఏర్పాటు చేసిన చారుమళ్లను తొలగించారు. తదనంతర సేవాదులను ముగించడంతో రథాలు లాగడం ఆరంభమైంది. ఈ ఏడాది నిర్ధారిత సమయం కంటే 3 గంటలు ముందుగా బహుడాలో రథాలు లాగడం ప్రారంభించడం విశేషం. సాయంత్రం 4 గంటలకు ప్రారంభం కావాల్సిన కార్యక్రమం.. మధ్యాహ్నం ఒంటి గంటకే శ్రీమందిరం వైపు పయనమయ్యాయి. మూల విరాట్‌ల రక్షకుడు సుదర్శన భగవానుడు తొలుత రథంపై ఆసీనుడయ్యాడు. సంప్రదాయం ప్రకారం ఉదయం 8.20 గంటలకు సుభద్రదేవి దర్పదళనంపై సుదర్శనుడు ఆసీను కావడంతో మూల విరాట్‌ల తరలింపు(పొహొండి) పుంజుకుంది. రథంపైకి తీసుకు వెళ్లడంతో పొహొండి ఆచారం ప్రారంభమైంది.

**గమ్యం చేరిన రథాలు..**

గుండిచా మందిరం నుంచి శ్రీమందిరం సింహద్వారం ముంగిటకు 3 రథాలు వడివడిగా చేరాయి. నిర్ధారిత సమయానికి గుండిచా నక్కొ ఛొణ ద్వారం ఆవరణ నుంచి బయల్దేరాల్సిన సమయానికి గమ్యం చేరి పోవడం విశేషం. సాయంత్రం 4.40 గంటలకు తాళధ్వజం, 4.45 గంటలకు దర్పదళనం రథాలు శ్రీమందిరం సింహద్వారం ఆవరణకు చేరగా చివరగా సాయంత్రం 6.45 గంటలకు జగన్నాథుని నందిఘోష్ రథం సురక్షితంగా గమ్యం చేరింది.

**రాత్రంతా రథాలపైనే..**

సింహద్వారం ముంగిటకు చేరిన మూడు రథాలు చతుర్ధా మూర్తులతో రాత్రంతా ఆరుబయట నిలిచి పోయాయి. దైనందిన సేవాదులను అక్కడే యథావిధిగా నిర్వహిస్తారు. రాత్రంతా భక్తులు, యాత్రికులు రథాలపై దేవుళ్లను కనులారా దర్శించుకునే అవకాశం కలిసి రావడం విశేషం.

**నేడు సొనా బెసో..**

యాత్రలో భాగంగా ఏడాదికోసారి భక్తులకు మూల విరాట్‌లు రథాలపై స్వర్ణాలంకారంతో భక్తులకు దర్శనం కల్పించడం విశేషం. గురువారం సంధ్య వేళలో ఈ దర్శనం ప్రారంభమై చిట్టచివరి వ్యక్తి దర్శనం చేసుకున్నంత వరకు రాత్రంతా నిరవధికంగా దర్శనం లభిస్తుంది.

**పాణక సేవ..**

రథాలపై కొలువు దీరిన స్వామికి నడి రేయిలో పాణక సేవ నిర్వహించడం సంప్రదాయం. దీనిని ఒధొరొ పొణా సేవగా అభివర్ణిస్తారు. మూల విరాట్‌ల పెదవులకు తాకే ఎత్తులో భారీ బాణలు ముందస్తుగా సిద్ధం చేస్తారు. వీటి నిండా సుగంధ ద్రవ్యాలతో కూడిన పాణకం నింపుతారు. ఆచారం ప్రకారం పూజాదులు నిర్వహించి పాణకంతో నిండిన బాణలు పగులగొట్టడంతో ఒధొరొ పొణా సేవ ముగుస్తుంది. యాత్రలో సహకరించిన అదృశ్య శక్తుల శాంతికి ఈ ఉత్సవం నిర్వహించడం విశేషం. ఈనెల 30 గురువారం ఈ ఉత్సవం జరగనుంది.

**నీలాద్రి విజే..**

రథయాత్రలో చివరి ఘట్టం ఒధొరొ పొణా. ఇది ముగియడంతో మర్నాడు రథాలపై దేవుళ్లను దించి శ్రీమందిరం రత్న వేదికపై యథాతథంగా ప్రతిష్టిస్తారు. ఈ ఉత్సవాన్ని నీలాద్రి విజేగా పేర్కొంటారు. దీంతో చతుర్ధామూర్తుల వార్షిక రథయాత్ర ముగుస్తుంది. జూలై 1న శుక్రవారం సంధ్య వేళలో ప్రారంభమై అర్ధరాత్రితో నీలాద్రి విజే ఈ క్రతువు పూర్తికానుంది.



బహుడా యాత్రలో తాళధ్వజం

### ఆరుగురికి గాయాలు

జగన్నాథుని బహుడా యాత్రలో స్వల్ప ప్రమాదం చోటుచేసుకుంది. యాత్ర సమయంలో బలభద్రుని రథం తాళధ్వజం తాడు తెగింది. దీంతో ఆరుగురు గాయాల పాలయ్యారు. వీరిలో ఒకరు భొయి సేవకునిగా గుర్తించారు. బాధితుడు నకుల భొయిని చికిత్స నిమిత్తం హుటాహుటిన పూరీ జిల్లా ప్రధాన ఆస్పత్రిలో చేర్చారు. రథం లాగుతుండగా తాడు తెగడంతో గాయపడినట్లు తెలిపారు. ప్రమాదంలో ఆయన ముఖం, ఛాతీ, చెవులపై గాయాలయ్యాయి. ఆరోగ్య పరిస్థితి స్థిమితంగా ఉన్నట్లు వైద్య వర్గాలు ప్రకటించారు.

### లక్ష్మీ, నారాయణుల భేటీ..

ఉదయం 8.50 గంటలకు తాళ ధ్వజానికి బలభద్ర మూలవిరాట్ తరలించారు. దేవి సుభద్ర పొహొండి ఉదయం 9 గంటలకు ప్రారంభం కాగా.. జగన్నాథుని పొహొండి ఉదయం 9.30 గంటలకు ప్రారంభమైంది. మారు రథయాత్రలో భాగంగా జగన్నాథుని రథం నందిఘోష్ మౌసిమా(పిన్నమ్మ) ఆలయం ఆవరణలో కాసేపు ఆగింది. రథంపై స్వామికి ముందుగా పిన్నమ్మ సిద్ధం చేసిన పొడొ పిఠాన్ని సమర్పించారు. ఇక్కడి నుంచి మరి కొంచెం ముందుకు సాగిన నందిఘోష్ గజపతి మహారాజా నగరి ముంగిట నిలిచింది. గజపతి మహారాజా దివ్యసింఘ్ లక్ష్మీ నారాయణుల భేటీ నిర్వహించారు. స్వామి నవ దినాత్మక యాత్ర విరహ వేదనతో తహతహలాడి పోతున్న శ్రీమహాలక్ష్మిని ముందస్తుగా బుజ్జగించి జగతి నాథునికి సురక్షితంగా శ్రీమందిరంలో రత్న వేదికపై యథాతథంగా చేర్చే ప్రయత్నంలో గజపతి మహారాజా ప్రత్యక్షంగా పాల్గొని జరిపించిన లక్ష్మీ నారాయణుల భేటీ చూడ ముచ్చటగా సాగింది. ఈ ఘట్టం ముగియడంతో నందిఘోష్ శ్రీమందిరం సింహద్వారం ఆవరణకు చేరింది.



లక్ష్మీనారాయణుల భేటీ నిర్వహిస్తున్న గజపతి మహారాజా దివ్యసింగ్ దేవ్



భక్తజనం మధ్య కదులుతున్న రథాలు

## ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



సీడీఎంఓ మిశ్రోకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

- అంబులెన్స్ డ్రైవర్ల డిమాండ్

రాయగడ: కోవిడ్-19 వంటి విపత్కర సమయంలో తమ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా ఎన్నో సేవలందించిన తమను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని జిల్లా అంబులెన్స్ డ్రైవర్ల సంఘం నిరసన వ్యక్తం చేసింది. ఈ మేరకు వివిధ డిమాండ్లకు సంబంధించి జిల్లా ముఖ్య వైద్యాధికారి(ఇన్‌చార్జి) డాక్టర్ వరదాకాంత్ మిశ్రోకు సంఘం నాయకులు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని, తాము సేవలందిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోయారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, విధి నిర్వహణలో ప్రాణాలు పోగొట్టుకున్న డ్రైవర్ల కుటుంబాలకు రూ.20 లక్షల పరిహారం, తీవ్ర గాయాలకు గురైతే రూ.10 లక్షల ఆర్థికసాయం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గంగాధర్ శొబొరో, షేఖ్ బుఖారి, పరీక్షిత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పూర్ణచంద్ర బక్క

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టనున్నామని ఎమ్మెల్యే పూర్ణచంద్ర బక్క తెలిపారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి ఆయన అధ్యక్షతన వహించారు. జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) మహేశ్వర్ చంద్ర నాయక్ హాజరై, సమితిలో చేపడుతున్న వివిధ పనులను వివరించారు. బోండా, దిదయి తెగలకు చెందిన గిరిజనులు నివసించే ప్రాంతాల్లో తాగునీరు, రోడ్లు, గృహనిర్మాణ, విద్యుత్, గ్రామీణాభివృద్ధి పనులను వర్షాలు ప్రారంభమయ్యే లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. సీజన్‌లో ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సమీక్షలో సీడీఎంఓ ప్రపుల్లకుమార్ నందొ, డీఆర్‌డీఏ పీడీ ప్రమిలా మాఝి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## విజిలెన్స్ వలలో ఫారెస్ట్ రేంజర్

- రూ.లక్షా 52 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన అధికారి





దిగపండి అటవీశాఖ కార్యాలయం వద్ద పోలీసులు



విజిలెన్స్ అధికారుల అదుపులో రేంజర్ కన్నుచరణ్ పట్నాయక్( మధ్యలో ఉన్న వ్యక్తి)

బరంపురం: విజిలెన్స్ వలలో మరో అవినీతి అధికారి చిక్కాడు. గంజాం జిల్లా దిగపండి ఫారెస్ట్ రేంజర్‌గా విధులు నిర్వహిస్తున్న కన్నుచరణ్ పట్నాయక్ ఓ పెండింగ్‌ను కేసును పరిష్కరించేందుకు రూ.లక్షా 52 వేలు లంచం తీసుకుంటూ అధికారులకు దొరికిపోయాడు. దీనిపై విజిలెన్స్ బరంపురం ఎస్పీ మయాధర్ స్వాయి అందించిన సమాచారం ప్రకారం దిగపండి ఫారెస్ట్ రేంజర్ కన్నుచరణ్ ఓ కేసులో పరిష్కారం నిమిత్తం పి.రాజ సేనాపతి అనే వ్యక్తి నుంచి లంచం అడగడంతో బాధితుడు విజిలెన్స్‌ను ఆశ్రయించారు. ఎస్పీ ఆదేశాలతో విజిలెన్స్ డీఎస్పీ సంతునుకుమార్ మహాపాత్రొ నేతృత్వంలోని బృందం పథకం పన్నారు. రూ.లక్షా 52 వేలు లంచం తీసుకుంటుండగా పక్కా ఆధారాలతో సహా పట్టుకున్నారు. అలాగే అతనికి సంబంధించిన నగరంలోని బ్యాంక్ కాలనీ నివాసంలో సోదాలు చేయగా మరో రూ.3.5 లక్షల నగదు పట్టుబడింది. ఈ మొత్తాన్ని సీజ్ చేసి, నిందితుడిని అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్పీ వివరించారు.

## క్లుప్తంగా

### రథయాత్ర సందర్భంగా పాదయాత్ర



మంగళపాలెం నుంచి సింహాచలం పాదయాత్రగా సాగుతున్న భక్తులు

కొత్తవలస: జగన్నాథస్వామి మారు రథయాత్ర సందర్భంగా మండలంలోని మంగళపాలెం గ్రామానికి చెందిన గురుదేవ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు ఆధ్వర్యంలో సింహాచలం వరకు బుధవారం పాదయాత్ర చేశారు. అరకు,పాడేరు ప్రాంతాలకు చెందిన సుమారు రెండువేల మందితో గిరిజనులతో ఈ యాత్ర నిర్వహించారు.సర్వే జనా సుఖినోభవంతు అంటూ యాత్ర సాగింది. పాదయాత్రలో కోలాటాలు, ప్రత్యేక భజనలు ఆకర్షణగా నిలిచాయి. ఈ తరహా యాత్రను ప్రతి ఏడాదీ జగన్నాథ స్వామి మారు రథయాత్ర రోజున నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నట్లు జగదీష్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

### మైనారిటీ కార్పొరేషన్ ఈడీగా లావణ్య

విజయనగరం ఫూల్‌బాగ్: మైనారిటీ కార్పొరేషన్ ఈడీగా ఎం లావణ్య (ఎఫ్‌ఏసీ) బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈడీగా ఇప్పటి వరకూ పనిచేసిన ఎం.లక్ష్మి తన మాతృసంస్థకు బదిలీపై వెళ్లడంతో తాను ఈ బాధ్యతలు చేపట్టినట్లు లావణ్య ఈ సందర్భంగా తెలిపారు.

### ఎన్‌సీసీ ఆఫీసర్‌కు రెడ్‌క్రాస్ పురస్కారం



అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ శశిభూషణరావు

విజయనగరం అర్బన్: గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ ఎం.వరలక్ష్మికి రెడ్ క్రాస్ సొసైటీ విజయనగరం సంస్థ నుంచి పురస్కారం లభించింది. ఈ మేరకు ఇటీవల పురస్కారం అందుకున్నట్లు కళాశాల యాజమాన్యం బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, వైస్ ప్రిన్సిపాల్స్ సీహెచ్‌వెంకటలక్ష్మి, డాక్టర్ దామోదరనాయుడు, గ్రంథాలయ అధికారి డాక్టర్ లెంక సత్యవతి తదితరులు ఆమెను అభినందించారు.

### సంగీత కళాశాలలో సర్టిఫికెట్, డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలు



మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల, విజయనగరం

విజయనగరం టౌన్: స్థానిక మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో సర్టిఫికెట్, డిప్లమో కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కేఏవీఎల్ఎస్.శాస్త్రి బుధవారం తెలిపారు. భారతీయ సంస్కృతి, కళల పట్ల అవగాహన కలిగించి ఆకర్షితులను చేసే ఉద్దేశంతో సంగీత కళాశాలలో నాలుగేళ్ల సర్టిఫికెట్ కోర్సు, రెండేళ్ల డిప్లమో కోర్సులను నిర్వహిస్తున్నామన్నారు. సర్టిఫికెట్ కోర్సులో ఉత్తీర్ణులైన వారు మాత్రమే డిప్లమో కోర్సుకు అర్హులని వెల్లడించారు. గాత్రం, వీణ, వయోలిన్, నాదస్వరం, మృదంగం, డోలు, భరతనాట్యం అంశాల్లో కోర్సులు ఉన్నాయన్నారు. ప్రవేశానికి దరఖాస్తులు చేయాలనుకునే అభ్యర్థులు 2023 జూలై ఒకటో తేదీనాటికి పదేళ్లు నిండి 60 ఏళ్ల లోపు వయసు కలిగి ఉండాలన్నారు. ఆసక్తి కల అభ్యర్థులు కళాశాల సమయవేళల్లో సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 08922-223751 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

### కేజీబీవీల్లో టీచింగ్ పోస్టుల భర్తీకి స్కిల్‌టెస్ట్

జామి: జిల్లాలో ఖాళీగా ఉన్న కేజీబీవీ టీచర్ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేసేందుకు బుధవారం స్కిల్ టెస్ట్ నిర్వహించారు. ఈ మేరకు జామి మండలంలోని కుమరాం కేజీబీవీలో డీఈఓ లింగేశ్వరరెడ్డి, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వరరావు,డైట్ ప్రిన్సిపాల్ తిరుపతినాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన స్కిల్ టెస్ట్‌కు మొత్తం 70 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ప్రిన్సిపాల్, సీఆర్టీ మ్యాథ్స్, సీఆర్టీ ఫిజిక్స్, సీఆర్టీ బయాలజీ, సీఆర్టీ ఇంగ్లీష్ పోస్టులకు స్కిల్‌టెస్ట్‌ను బుధవారం నిర్వహించారు. గురువారం ఇదే పాఠశాలలో ఉదయం 10 గంటలకు పీజీటీ జువాలజీ, పీజీటీ ఫిజిక్స్, పీజీటీ ఇంగ్లీష్, పీజీటీ కెమిస్ట్రీ, పీజీటీ బోటనీ, మధ్యాహ్నం ఒంటిగంటకు పీజీటీ హిస్టరీ, పీజీటీ ఎకనామిక్స్, పీజీటీ కెమిస్ట్రీ, పీజీటీ సివిక్స్ పోస్టులకు స్కిల్ టెస్ట్ నిర్వహించనున్నట్లు డీఈఓ లింగేశ్వరరెడ్డి తెలిపారు.

# బహుముఖ ప్రజ్ఞాశాలి.. విక్రమదేవ్ వర్మ

- 154వ జయంతి సభలో ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి



సాహిత్య సామ్రాట్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్, సాహితీవేత్తలు

జయపురం: బహుముఖ ప్రజ్ఞాశాలి.. జయపురం మహారాజు, సాహితీ సామ్రాట్ విక్రమదేవ్ వర్మ అని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అభివర్ణించారు. బుధవారం విక్రమదేవ్ వర్మ 154వ జయంతి సందర్భంగా స్థానిక మధుమతి సభాగృహంలో ఒడిశా సాహిత్య అకాడమీ, జయపురం సాహితీ పరిషత్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఒడిశా సాహిత్య అకాడమీ సభ్యులు లక్ష్మీ కాంత పాఢి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. విక్రమ్‌దేవ్ వర్మ తనదైన పాలనతో పాటు సాహిత్యం, నాట్యం, పరిశోధన, బహుభాషా పండితుడిగా ఎంతో ప్రతిభ చూపారని కొనియాడారు. భారతీయ సంస్కృతి, గౌరవాలను కాపాడుతూ ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లో విద్య, వైద్యం, భాష, సాహిత్యం, సంస్కృతులను బలోపేతం చేసేందుకు కృషి చేశారన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ కులపతిగా, జయపురంలో రాష్ట్రంలోనే మొదటి ఆర్ట్స్ కళాశాల ఏర్పాటులో విద్యా రంగానికి సేవలందించారని గుర్తుచేశారు. పర్లాకిమిడిలో జరిగిన 10వ ఉత్కళ సమ్మేళనంలో అధ్యక్షత వహించడం తోపాటు చేసిన ప్రసంగం ఒడిశాపై ఆయనకు ఉన్న మక్కువను ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆదివాసీ భాష సంస్కృతి, జీవనం, కళల పరిశోధకులు డాక్టర్ పరేష్ రథ్ రచించిన 'సాహిత్య సామ్రాట్ విక్రమదేవ్ వర్మ' ఆంగ్ల పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సాహితీవేత్త డాక్టర్ ప్రదీప్‌కుమార్ మిశ్రా, ప్రముఖ రచయిత డాక్టర్ పరేష్ రథ్ లను సాహితీ సామ్రాట్ విక్రమదేవ్ అవార్డు అందజేసి, ఘనంగా సన్మానించారు. ప్రముఖ గాయకుడు హృదయానంద ప్రధాన్ ఆలపించిన పాటలు శ్రోతలను ఉర్రూతలూగించాయి. కార్యక్రమంలో సాహితీవేత్తలు శ్రీకాంత మిశ్రా, పాత్రికేయులు ప్రకాశ్ మిశ్రా, సాహితీవేత్త ప్రేమానంద దాస్, రబి శత్పతి తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ పరేష్ రథ్‌కు అవార్డు అందిస్తున్న దృశ్యం



గీతాలాపనలో హృదయానంద ప్రధాన్

# ఏకామ్ర ప్రాజెక్టుకు శంకుస్థాపన

- భూమిపూజ చేసిన సీఎం నవీన్ పట్నాయక్
- రూ.280 కోట్లు కేటాయించిన రాష్ట్రప్రభుత్వం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న దృశ్యం




లింగరాజు ఆలయంలో ఏకామ్ర ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: రాష్ట్ర రాజధాని నగరంలోని లింగరాజు ఆలయంలో రూ.280 కోట్ల వ్యయ ప్రణాళికతో కూడిన ఏకామ్ర క్షేత్ర ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ శంకుస్థాపన చేశారు. సుందరీకరణ, పరివర్తన ప్రాజెక్టు కోసం తమ భూములను కేటాయించిన దుకాణదారులు, వ్యక్తులను ఈ సందర్భంగా సత్కరించారు. గత మూడు మూడు రోజులుగా కొనసాగుతున్న భూమిపూజ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఏకామ్ర క్షేత్రం సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించేందుకు లింగరాజు ఆలయ ట్రస్ట్ బోర్డు ఈ వేడుకను నిర్వహించింది. రాష్ట్రప్రభుత్వం 2019లో క్షేత్రంలో సౌకర్యాలు, స్మారక చిహ్నాల పునరుద్ధరణ కార్యాచరణ ప్రణాళికతో ఏకామ్ర ప్రకల్పను ప్రారంభించింది. దీని కోసం ఆలయ ప్రాంతంలో వివిధ స్మారక చిహ్నాలు, పవిత్ర కొలనులు, పుష్కరిణులు, ఇతర జలాశయాలు సహా 80 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ఈ పురాతన సాంస్కృతిక ప్రాంత గొప్పతనాన్ని పునరావిష్కరణ ఏకామ్ర ప్రకల్ప లక్ష్యం. ఈ ప్రాజెక్ట్ కింద ఏకామ్ర క్షేత్రం నిర్మాణ, పురావస్తు సంపదను పునరుద్ధరణ చేపడతారు. తొలి దశలో ఈ ప్రాంతపు వారసత్వ పునరుద్ధరణ, సాఫీగా వాహనాల రాకపోకలకు 12–18 మీటర్ల వెడల్పు మిశ్రమ ట్రాఫిక్ లైన్, పాదచారులకు అనుకూలంగా 4–10 మీటర్ల వెడల్పు నీడతో కూడిన నడకమార్గం, రద్దీ నియంత్రణకు పార్కింగ్ సౌకర్యాలు ఉంటాయి. అదనంగా యాత్రికుల సౌకర్యార్థం 300 చదరపు మీటర్ల సౌకర్య సముదాయం నిర్మిస్తారు. ఈ సందర్భంగా లింగరాజ్ దేవాలయం, అనంత వాసుదేవాలయం, ముక్తేశ్వరాలయం, బిందుసాగర్, ఇతర సమీపంలోని ఆలయాలను దేదీప్యమానంగా తీర్చిదిద్దారు.

# కిక్కిరిసిన భక్తజనం

- నందడిగా బహుడా యాత్ర
- తిరుగుముఖం పట్టిన రథాలు




బరంపురం: హనుమాన్ బజార్ జంక్షన్ నుంచి తిరుగుముఖం పట్టిన రథాలు



కొరాపుట్: తిరుగు ప్రయాణంలో దేవదేవుళ్ల రథాలు



బరంపురం: మిలటరీ లైన్‌లో రథయాత్ర చేపడుతున్న చిన్నారులు



కొరాపుట్: నవరంగ్‌పూర్‌లో చెరాపొర నిర్వహిస్తున్న నర్సింగ త్రిపాఠి





కొరాపుట్: నందపూర్‌లో రథయాత్ర తిలకిస్తున్న పొట్టంగి ఎమ్మెల్యే పీతం పాఢి

బరంపురం: నగరంలో గత 9 రోజులుగా వివిధ కుడళ్లలో జరుగుతున్న రథయాత్ర ఉత్సవాలు బుధవారం అంబరాన్ని తాకాయి. గుండిచా మందిరం నుంచి రథాలు ప్రధానాలయం వైపు తిరుగుముఖం పట్టాయి. ఈ సందర్భంగా భక్తజనంతో కిక్కిరిసింది. గత వారం రోజులుగా వివిధ అవతారాల్లో భక్తులకు దర్శనమిచ్చిన జగన్నాథుని సేవలో భక్తులు తరించారు. బరంపురం నగరంలోని గుసానినువగాం, కోర్టుపేట, మిలటరీ లైన్, బెజ్జిపూర్, పాతలేశ్వర్ తదితర ప్రాంతాల్లో ఉత్సవాలు సందడిగా సాగాయి. అలాగే వీధుల్లో చిన్నారులు మేల తాళాలతో రథాలను ఊరేగించి, ఆకట్టుకున్నారు.

కొరాపుట్: రథయాత్ర తిరుగు ప్రయాణంలో భాగంగా జరిగిన బహుడాలో రథాలు క్షేమంగా మందిరాలకు చేరుకున్నాయి. కొరాపుట్, నవరంగ్‌పూర్ జిల్లాల్లో ఉత్సవాలు ఘనంగా సాగాయి. నవరంగపూర్‌లో రాజ పురోహితుడు నర్సింగ త్రిపాఠి చెరాపహారా చేపట్టడంతో యాత్ర ప్రారంభమైంది. దక్షిణ పూరీగా ప్రసిద్ధి చెందిన కొరాపుట్ లోని శబరి శ్రీక్షేత్రంలో రాయగడ రోడ్డు నుంచి రథాలు బయలుదేరి, సునాబెడ రోడ్డు లోని కలెక్టరేట్ జంక్షన్ వరకు చేరుకున్నాయి. నందపూర్‌లో పొట్టంగి ఎమ్మెల్యే పీతం పాఢి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఉమ్మర్‌కోట్‌లో మాజీ ఎమ్మెల్యే సుభాష్ గొండొ, అతని సతీమణి రాయిఘర్ సమితి చైర్‌పర్సన్ నవీనా గొండొ రథం లాగారు.

జయపురం: పట్టణంలో జరిగిన మారు రథయాత్రలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. గుండిచా మందిరం నుంచి బయలుదేరిన రథాలు మార్గంలో చైతన్య మందిరం వద్ద నిలిచాయి. సంప్రదాయ ప్రకారం రాత్రంతా భక్తుల దర్శనార్థం చైతన్య మందిరం వద్దే జగన్నాథ, బలభద్ర, సుభద్ర దేవతామూర్తుల రథాలను నిలిపారు. యాత్రలో భాగంగా జయపురం కళింగవైశ్య సంఘం, కన్యకా పరమేశ్వరి మందిర కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేపట్టారు. అలాగే పరిసర గూడేల నుంచి ఆదివాసీలు హాజరై, యాత్రలో పాల్గొన్నారు. ఇస్కాన్ భక్తుల భజనలు ఆకట్టుకున్నాయి.

రాయగడ: భక్తుల హరేరామ, జై జగన్నాథ్ నామ స్మరణతో బహుడా యాత్ర మార్మోగింది. మధ్యాహ్నం 4.30 గంటలకు రథాలను ప్రధాన మందిరానికి చేర్చగా.. మార్గం మధ్యలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్, ఎస్పీ వివేకానంద శర్మ, స్పెషల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(ఎస్‌డీసీ) అధ్యక్షురాలు అనసూయా మాఝి తదితర ప్రముఖులు రథం లాగే కార్యక్రమానికి హాజరయ్యారు. అలాగే గురువారం సునాబెసో అలంకరణలో దేవతామూర్తులు భక్తులకు దర్శనమివ్వనున్న నేపథ్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పర్లాకిమిడి: మారు రథయాత్ర సందర్భంగా పర్లాకిమిడిలో యువరాణి కల్యాణీదేవి గజపతి గుండిచా మందిరం వద్ద ఉన్న రథాలను బంగారు చీపురుతో శుభ్రం చేయడంతో యాత్ర లాంఛనంగా ప్రారంభమైంది. అనంతరం వరుస క్రమంలో బలభద్ర, సుభద్ర, జగన్నాథ రథాలపై దేవతామూర్తులకు పూజలు చేసి హారతులిచ్చారు. అనంతరం రథాలను మార్గం మధ్యలోని రాజవీధి మొసిఘరో వద్దకు చేర్చి, నిలిపివేశారు. ఇక్కడే రెండు రోజులు జగన్నాథుడు దర్శనమివ్వనున్నాడు. కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్, సబ్ డివిజన్ పోలీసు అధికారి రామకృష్ణ పతి, ఐఐసీ బబులీ నాయక్, సిబ్బంది శాంతి భద్రతలను పర్యవేక్షించారు. అలాగే బహుడా యాత్రకు వచ్చిన యాత్రికులకు అన్నప్రసాదాలు, తాగునీటిని కళింగవైశ్య సంఘం ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో సమకూర్చారు. కమిటీ సభ్యులు పోలిశెట్టి, పైడిశెట్టి నగేష్, పొట్నూరు శంకర్రావు, పైడిశెట్టి మురళీ, బరాటం నాగేశ్వరరావు పాల్గొన్నారు.



జయపురం: రథాయాత్రలో పాల్గొన్న ఆదివాసీ మహిళలు



జయపురం: యాత్రలో భక్తుల నృత్యాలు



రాయగడ: రథం లాగుతున్న కలెక్టర్, ఎస్పీ, ఎస్‌డీసీ చైర్మన్లు



రాయగడ: రథయాత్ర తిలకించేందుకు వచ్చిన భక్తజనం



పర్లాకిమిడి: గుండిచా మందిరం వద్ద చిన్నారుల ఒడిస్సీ నృత్యం





పర్లాకిమిడి: రాజవీధిలో అన్నప్రసాదాల పంపిణీ చేస్తున్న మహిళ



పర్లాకిమిడి: మారు రథాయాత్రలో భక్తజనం

# రాష్ట్రంలో బీజేపీకి అనుకూల పవనాలు



వేదికపై ఎమ్మెల్యే ధర్మలాల్, నాయకులు

- ఛత్తీస్‌గఢ్ ఎమ్మెల్యే ధర్మలాల్ కౌషిక్

రాయగడ: ఒడిశాలో బీజేపీ విజయానికి అనుకూల పవనాలు వీస్తున్నాయని, కేంద్రప్రభుత్వ పథకాలు, ప్రధాని మోదీకి రోజురోజుకీ పెరుగున్న ఆదరణే దీనికి తార్కాణమని ఛత్తీస్‌గఢ్ ఎమ్మెల్యే, ఆ పార్టీ రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు ధర్మలాల్ కౌసిక్ పేర్కొన్నారు. జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పంచాయతీ పరిధి సారిసో పాదోరో గ్రామంలో మంగళవారం సాయంత్రం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో 2దశాబ్దాలకు పైగా అధికారంలో ఉన్న నవీన్ పట్నాయక్ పాలనపై ప్రజలు విసిగెత్తి పోయారని విమర్శించారు. ఒడిశాలో యాంత్రిక పాలన కొనసాగుతోందని, ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధి కాకుండా అధికారుల ప్రమేయంతో ప్రజలు తల్లడిల్లుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే తరుణంలో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి మద్దతు తెలిపేందుకు సిద్ధంగా ఉన్నారని అభిప్రాయం వ్యక్తంచేశారు. బీజేపీ రాష్ట్రశాఖ ఎస్సీ, ఎస్టీ మోర్చా రాష్ట్రశాఖ ఉపాధ్యక్షుడు కాశీరాం మాఝి మాట్లాడుతూ గత దశాబ్ద కాలంగా రాష్ట్రంలో పార్టీ అంచెలంచెలుగా ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. అలాగే మరికొద్ది రోజుల్లో ఒడిశాలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా కనుమరుగువ్వడం ఖాయమని ఎద్దేవా చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివ పట్నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు ప్రశాంత్ మాఝి, హరీష్ ముదులి, భారత్ లెంక, గుణనిధి బాగ్ తదితరులు పాల్గొన్నారు.

# జయపురంలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర శాఖ



బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర శాఖను ప్రారంభిస్తున్న ఈఓ సిద్ధార్థ పట్నాయక్

జయపురం: స్థానిక పట్టణంలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర నూతన శాఖను జయపురం మున్సిపాలిటీ ఈఓ సిద్ధార్థ పట్నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ ఒడిశాలో పెద్ద పట్టణాల్లో జయపురం ఒకటని.. వ్యాపార, వాణిజ్య రంగాల్లో రోజురోజుకూ పురోగతి సాధిస్తోందని తెలిపారు. ఇటువంటి తరుణంలో స్థానిక వ్యాపారులు, పరిశ్రమల యజమానులు, రైతులకు బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర అధికారులు విరివిగా రుణాలు మంజూరు చేసి, వ్యవసాయ, పారిశ్రామిక, వ్యాపార రంగాల అభివృద్ధికి చేయూత అందివ్వాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర రీజనల్ మేనేజర్ సంజయకుమార్ దాస్, జయపురం శాఖ మేనేజర్ కాల శ్రీను, సబ్ డివిజన్ పోలీసు అధికారి హరీష్ బీసీ, వర్తకులు పాల్గొన్నారు.

# గ్యాస్ ట్యాంకర్ కింద పడి డ్రైవర్ మృతి



దినేష్ మృతదేహం

రామభద్రపురం: మండలంలోని ఆరికతోట సమీపంలో డాబా వద్ద గ్యాస్ ట్యాంకర్ బ్యాక్ చేస్తుండగా ప్రమాదవశాత్తు ట్యాంకర్ కింద పడి డ్రైవర్ మృతి చెందాడు. బుధవారం జరిగిన ఈ ప్రమాదంపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన దినేష్ యాదవ్ రాయపూర్ నుంచి విశాఖపట్నం గ్యాస్ ట్యాంకర్ తీసుకుని వెళ్తున్నాడు. ఆరికతోట సమీపంలోని డాబా వద్ద కొద్దిసేపు ఉపశమనం పొందుదామన్న ఉద్దేశంతో ఆపి వేరే లారీ డ్రైవర్‌ను పిలిచి పార్కింగ్ కోసం ట్యాంకర్‌ను బ్యాక్ చేయాలని తాను వెనుక ఉండి సిగ్నల్ ఇస్తానని కోరాడు. వెంటనే వేరే లారీ డ్రైవర్ ట్యాంకర్‌ను బ్యాక్ చేస్తుండగా వెనుక ఉండి సిగ్నల్ చూపుతున్న దినేష్‌పైకి ప్రమాదవశాత్తు ట్యాంకర్ వచ్చేసింది. దీంతో దాని చక్రాల కింద పడి దినేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. బ్యాక్ చేసిన డ్రైవర్ పరారీలో ఉన్నాడు. ఈ ఘటనపై ఎస్సై సురేంద్ర నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## క్లుప్తంగా

### గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి

- విశాఖ జీఆర్పీ లైన్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటరావు



కాశీబుగ్గ: జీఆర్పీ సిబ్బందితో మాట్లాడుతున్న వెంకటరావు

కాశీబుగ్గ/ఆమదాలవలస: రైళ్లలో గంజాయి అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని విశాఖపట్నం జీఆర్పీ లైన్స్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటరావు చెప్పారు. పలాస, శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస) జీఆర్పీ స్టేషన్లను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడారు. రైళ్లలో ఫుట్ బోర్డు ప్రయాణాలు లేకుండా చూడాలన్నారు. ప్రయాణికులు కూడా తెలియని వ్యక్తులు ఇచ్చే తినుబండారాలు, ఆహారాన్ని తీసుకోవద్దని సూచించారు. మత్తు పదార్థాలు, గంజాయి రవాణాపై ప్రత్యేక దృష్టిసారించాలని సిబ్బందికి సూచించారు. లోకల్ పోలీస్, ఆర్పీఎఫ్ సిబ్బందితో సమన్వయం చేస్తూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరించాలన్నారు. పలాస స్టేషన్ ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతమైనందున ఒడిశా నుంచి వచ్చు పోవు రైళ్లలో ప్రత్యేక స్క్వాడ్ టీం పెట్టి రాత్రిపూట గస్తీ పెంచాలన్నారు. ఆమదాలవలస స్టేషన్‌లో దస్త్రాలను పరిశీలించారు. పలు నేరాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో పలాస జీఆర్పీ ఎస్సై షరీఫ్, ఏఎస్సైలు, హెచ్‌సీలు, హోంగార్డులు ఉన్నారు.

### దాడి కేసులో ఐదుగురు అరెస్టు

పోలాకి: గుప్పెడుపేట గ్రామానికి చెందిన నందుపల్లి ధనరాజ్‌పై ఈనెల 22వ తేదీన దాడి జరిగింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం అంపోలు జిల్లా జైలుకు తరలించినట్టు పోలాకి ఎస్‌ఐ వి.సత్యన్నారాయణ బుధవారం తెలిపారు.

### ఎర్రచందనం కేసులో వ్యక్తి అరెస్టు

టెక్కలి రూరల్: ఎర్ర చందనం అక్రమ రవాణా కేసులో ఒకరిని అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. గత ఏడాది సెప్టెంబర్ ఆరో తేదీన బొప్పాయిపురం సమీపంలో ఎర్రచందనం తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అప్పట్లో 11 మందిని అరెస్టు చేశారు. మరో వ్యక్తి ఉన్నాడనే సమాచారంతో పోలీసులు గాలిస్తూనే ఉన్నారు. చివరకు ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా గండాహాతికి చెందిన గణేష్ పండాని బుధవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్టు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

### గాయపడిన వ్యక్తి మృతి

ఎల్.ఎన్.పేట: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. రావిచెంద్రి గ్రామానికి చెందిన పాదిలాపు భాస్కరరావు (60) ఈ నెల 25వ తేదీన ద్విచక్ర వాహనంపై వెళ్తూ అదుపు తప్పి పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డారు. జెమ్స్‌కి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయినట్టు చెప్పారు.

### మద్యం తాగవద్దన్నందుకు..

- వ్యక్తి బలవన్మరణం



మధుబాబు మృతదేహం

శ్రీకాకుళం క్రైమ్: కుటుంబ పోషణ కష్టంగా ఉందని.. మద్యం తాగొద్దని భార్య అన్నందుకు మనస్తాపంతో భర్త విషం తాగి ప్రాణాలు తీసుకున్నాడు. ఈ ఘటనకు సంబంధించి రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ పప్పల శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బూబమ్మనగర్ బలగ మెట్టులో శాసనపురి మధుబాబు (52) భార్య కల్యాణి, ఇద్దరు కుమారులతో నివసిస్తున్నారు. కుమారులిద్దరూ ఉద్యోగ రీత్యా బయట ఉన్నారు. మధుబాబు తినుబండారాల లైన్ వ్యాపారం చేస్తుండేవాడు. ఆయనకు మద్యం తాగే అలవాటు ఉండటంతో భార్య తాగవద్దని నచ్చజెప్పేది. ఈ నెల 27న మధ్యాహ్నం కూడా మధుబాబు తాగి రావడంతో కల్యాణి మందలించింది. దీంతో బయటకు వెళ్లిపోయిన మధుబాబు రాత్రి ఎనిమిదిన్నర గంటల సమయంలో మద్యం మత్తులోనే ఇంటికి వచ్చాడు. అయినా ఏమీ అనకుండా టిఫిన్ పెట్టడంతో తినేసి హాలులో పడుకున్నాడు. రాత్రి రెండు గంటల సమయంలో వాష్‌రూమ్‌కని భార్య లేచిచూసేసరికి నురగ కక్కుతూ భర్త కనిపించడంతో ఆందోళనకు గురైన ఆమె బంధువుల సాయంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మధుబాబు చనిపోయినట్టు సీఐ చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

### 11 కిలోల గంజాయి స్వాధీనం!

ఆమదాలవలస: ఆమదాలవలస రైల్వేస్టేషన్ సమీపంలో వన్ వే జంక్షన్ వద్ద సుమారు 11 కిలోల గంజాయితో ముగ్గురు కేరళ యువకులు పోలీసులకు పట్టుబడినట్లు తెలిసింది. మంగళవారం అర్ధరాత్రి ఆమదాలవలస ఇన్‌చార్జ్ ఎస్‌ఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో సోదాలు జరుపుతుండగా వీరు పట్టుబడగా స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. కాగా, బుధవారం ఆమదాలవలస ఎస్సై-3 రఘునాథరావు ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ కూడలి వద్ద నిందితులతో సీన్ క్రియేట్ చేశారు. పూర్తి వివరాలు తర్వాత వెల్లడిస్తామని సీఐ పైడయ్య తెలిపారు.

---

ఆటో ఆతిథ్యం: నగరంలో ఆహార పదార్థాల విక్రయం



# చక్రాలపై సంప్రదాయ ఘుమఘుమలు

సాయం సంధ్య వేళ.. అంతవరకు ఇళ్లలోనూ, ఉద్యోగ వ్యాపకాలతో బిజీగా గడిపిన ప్రజలు కాస్త కులాసాగా గడిపేందుకు నగర వీధుల్లోకి రాగానే ఘుమఘుమలాడుతూ.. చవులూరించే పరిమళాలు ఆకర్షిస్తుంటాయి. రా.. రమ్మని ఆహ్వానిస్తుంటాయి. శ్రీకాకుళం నగరంలోని ప్రధాన కూడళ్లలో కొలువుదీరే వాహనాలే ఈ ఘుమఘుమలకు కేంద్రాలు. శుచికి, శుభ్రతకు ప్రతీకలుగా నిలిచే ఈ వాహనాలు సంచార తినుబండారాల నిలయాలు. పూర్ణం బూరెలు వంటి సంప్రదాయ పిండి వంటలతో పాటు.. మష్రూమ్ రైస్, ఫ్రైడ్ రైస్ వంటి ఆధునిక ఆహార పదార్థాలతో కనువిందు చేస్తుంటాయి. చిత్రం ఏమిటంటే.. నగరంలో ఉన్న ఈ తరహా సంచార విక్రయశాలలన్నింటిలోనూ ఒకే రకమైన పదార్థాలు లభిస్తాయి. నగరంలో మూడుచోట్ల ఉన్న వంటశాలల్లో ఆహార పదార్థాలు తయారు చేసి.. బ్యాటరీ వాహనాల్లో సర్ది రద్దీ కూడళ్లకు తరలించి సరసమైన ధరలకు విక్రయిస్తారు. ఈ ఆహార వ్యాపారం ద్వారా వందల మంది ఉపాధి పొందుతున్నారు.

- నగరం నలుమూలలకూ ఆటోల్లో పసందైన వంటకాలు తరలింపు
- అందుబాటు ధరల్లో విక్రయాలు
- బ్యాటరీ వాహనాలను అవసరానికి తగినట్లుగా తీర్చిదిద్ది వినియోగం
- మహిళలు, యువతకు ఉపాధి మార్గం..



శ్రీకాకుళం డెస్క్

సాయంత్రం నాలుగు దాటితే చాలు.. ఘుమఘుమలు వెదజల్లుతూ మూడు చక్రాల వాహనాలు నగరం నలువైపులకు బయల్దేరతాయి. కొన్నైతే హైవేపై ప్రయాణించి సమీపంలోని కూడళ్లకు చేరుకుంటాయి. పప్పు బూరెలు, కుడుం బూరెలు, కొబ్బరి బూరెలు, నాలుగైదు రకాల రైస్ ఐటెమ్స్, పెరుగు వడ, జున్ను, పులిహోర వంటి వంటకాలే మెనూలో చోటు దక్కించుకున్నాయి. రాత్రి తొమ్మిదిన్నర వరకు భోజన ప్రియుల ఆకలి తీర్చి మళ్లీ ఇంటి బాట పడుతున్నారు విక్రయదారులు. ఈ ఆటో ఆతిథ్యానికి నగరంలో రోజురోజుకీ ఆదరణ పెరుగుతోంది.

**వంటా వార్పు ఎక్కడ..**

శ్రీకాకుళం నగరంలో ప్రధానంగా మూడు ప్రాంతాల్లో వంటకాల తయారీ కేంద్రాలున్నాయి. హౌసింగ్ బోర్డు కాలనీ, మారుతీ థియేటర్, జిల్లా పరిషత్ సమీపంలో ఉదయం 9 గంటల నుంచి వంటకాల తయారీ ప్రారంభమవుతుంది. మూడు కేంద్రాల్లోనూ సుమారు 100 మంది వరకు మహిళలు ఉపాధి పొందుతున్నారు. వీరిలో ఒంటరి మహిళలు.. కుటుంబం భారం మోసే వారేకే అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు వ్యాపారులు చెబుతున్నారు.

**అందరూ పాకశాస్త్ర ప్రవీణులే..**

సంప్రదాయ వంటలు తయారు చేయడం అందరివల్లా కాదు. పలిహోరా, బొబ్బట్లు, బూరెలు, వడలు లాంటివి చేయాలంటే మాత్రం ప్రావీణ్యం తప్పనిసరి. ఇక్కడ వంటశాలల్లో ఉండే మహిళల్లో అధికశాతం గరిటె తిప్పి అద్భుతమైన రుచితో వంటకాలను సిద్ధం చేయడంలో సిద్ధహస్తులు. వీరు తయారు చేసే వంటలను బట్టే వీరికి వేతనం ఉంటుందని చెబుతున్నారు వ్యాపారులు.

**పర్యావరణ హితంగా..**

ఈ విక్రయాలకు వినియోగించే ఆటోలు పూర్తిగా పర్యావరణ హితమైనవి. బ్యాటరీ వాహనాలనే ఆహారం విక్రయాల కోసం వినియోగిస్తున్నారు. ఓ దుకాణం మాదిరిగా తీర్చిదిద్ది అవసరమైన లైటింగ్, వాటర్ ట్యాంక్, మైక్రో ఒవెన్ ఇతర సదుపాయాలను అందులో కల్పిస్తున్నారు. రోజువారీ శుభ్రం చేసుకోవాడానికి వీలుగా లోపలి భాగాన్ని పూర్తిగా స్టెయిన్ లెస్ స్టీల్‌తో తయారు చేస్తున్నారు.

**ఒక్కో వాహనం రూ.3 లక్షలు**

బ్యాటరీ వాహనాన్ని కొనుగోలు చేసి దాన్ని అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడానికి రూ.3 లక్షలు ఖర్చవుతోందని వ్యాపారులు చెబుతున్నారు.7 గంటలు చార్జింగ్ చేస్తే 4 గంటలు పాటు ఉంటుందని చెబుతున్నారు. ఫుడ్ బిజినెస్ కావతడంతో పర్యావరణ హితమైన వాహనాలకు ప్రాధాన్యమిచ్చామని చెబుతున్నారు.







**నోరూరించే మెనూ ఇదే..**

మష్రూమ్ బిర్యానీ, వెజ్ బిర్యానీ, ఫ్రైడ్‌రైస్, సాంబార్ వడ, పెరుగు గారె, జున్ను, పులిహోర, కొబ్బరి బూరె, కుడుం బూరె







| | | |
|---|---|---|
| నగరంలో ఫుడ్‌ను విక్రయించే ఆటోలు | 18 | వరకు |
| నగరంలో వంటశాలలు | 3 | |
| ప్రత్యక్షంగా ఉపాధి పొందుతున్న మహిళలు | 100 | మంది |

**ధరల మాటేమిటి**

- రైస్ ఐటెమ్స్ క్వాంటిటీని బట్టి ధరను నిర్ణయించారు. కప్పు బిర్యానీ రూ.30 నుంచి విక్రయిస్తున్నారు.
- సాంబారు వడ, పెరుగు వడ ధర రూ.20
- బాదం జున్ను రూ.30, బెల్లం, పంచదార జున్ను రూ.25కు విక్రయిస్తున్నారు.

**వెరీ టేస్టీ..**



ఆటో ఆతిథ్యం చాలా బాగా నచ్చింది. బూరెలు చాలా ఇష్టం. వీలుచిక్కినప్పుడల్లా తినేందుకు ఆసక్తి చూపుతా. బిర్యానీలు కూడా బాగుంటాయి.

– జ్యోతి ప్రసాద్, చిన్నబజారు

**సాంబారు వడ ఇష్టం..**



రోజు సాయంత్రం సాంబారు వడ తినేందుకు వస్తుంటాను. పొగలు కక్కే సాంబారులో చక్కని వడ తింటే ఆ అనుభూతే వేరు.

– రాజు, కలెక్టర్ ఆఫీసు రోడ్

---

### శాకంబరీదేవిగా కొత్తమ్మతల్లి



ఆషాఢమాస ఉత్సవాల సందర్భంగా కోటబొమ్మాళిలో కొత్తమ్మతల్లి అమ్మవారిని పలు రకాల కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. గురువారం అమ్మవారు శాకంబరీదేవిగా భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఈఓ వాచకవర్ల రాధాకృష్ణ తెలిపారు. – కోటబొమ్మాళి

### జగన్నాథునికి 56 పిండివంటలతో నైవేద్యం



శ్రీకాకుళం నగరంలోని మొండేటి వీధిలో షిరిడీసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రథయాత్ర బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా స్వామివారిని శేషపాన్పు అవతారంలో అలంకరించి 56 రకాల పిండివంటలతో నైవేద్యాలు సమర్పించారు.

– శ్రీకాకుళం కల్చరల్

---

## డిసెంబర్ నాటికి వంశధార రిజర్వాయర్ పూర్తి

హిరమండలం: వంశధార రిజర్వాయర్ నిర్మాణ పనులు డిసెంబర్ నెలాఖరులోగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల చీఫ్ ఇంజినీర్ ఎస్.సుగుణాకర్ తెలిపారు. బుధవారం హిరమండలంలో వంశధార రిజర్వాయర్ పనులతో పాటు ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించారు. అనంతరం వంశధార అతిథి గృహంలో ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్ట్ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం రిజర్వాయర్ పనులు 95 శాతం పూర్తయినట్లు తెలిపారు.రూ.175 కోట్లతో ఎత్తిపోతల పనులు అక్టోబర్ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని పనులను డిసెంబర్ నాటికి పూర్తి చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి స్థిద్ధం చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కుడి కాలువ కంటే ఎడమ కాలువ పనులకు ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో రూ.299 కోట్లతో మహేంద్రతనయ, ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు జరుగుతున్నాయని వివరించారు. వంశధార నది గొట్టా బ్యారేజీ షట్టర్లు కుంభకోణంపై సీఐడీ దర్యాప్తు జరుగుతోందన్నారు. సుమారు ఆరు వేల మంది దిగువ స్థాయి సిబ్బందిని కాంట్రాక్టు పద్ధతిలో నియమించేందుకు ప్రతిపాదనలు పంపించామన్నారు. వంశధార ఎస్ఈ తిరుమలరావు మాట్లాడుతూ వంశధార కుడిగట్టు పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

---

## అనుమానం.. అమానుషం

- కన్న కొడుకునే హత్య చేసిన తండ్రి
- గాయాలతో బయటపడిన మరో కుమారుడు
- కుప్పిలిలో దారుణం



నిందితుడు కుప్పయ్య

ఎచ్చెర్ల క్యాంపస్: అతనికి 54 ఏళ్లు. తన 50 ఏళ్ల భార్యపై అనుమానం పెంచుకున్నాడు. ఇంకేముంది ఎప్పుడు చూసినా గొడవలే. దీనికితోడు ఇద్దరు కుమారులు కూడా తల్లి పక్షానే ఉండటంతో మరింత కక్ష పెంచుకున్నాడు. అందరినీ చంపేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో కత్తితో దాడికి దిగడంతో పెద్ద కుమారుడు ప్రాణాలు కోల్పోగా, చిన్న కుమారుడు గాయాలతో బయటపడ్డాడు. ఈ ఘటన ఎచ్చెర్ల మండలం కుప్పిలిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..

కుప్పిలి గ్రామానికి చెందిన కొంద్రు కుప్పయ్య, హరమ్మలు భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె అప్పాయమ్మకు ఇదే గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహమైంది. వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్న కుప్పయ్య భార్యపై అనుమానం పెంచుకున్నాడు. తరచూ ఇంట్లో గొడవ పడేవాడు. తల్లిని నిలదీయాలంటూ పిల్లలతో సైతం గొడవకు దిగేవాడు. తండ్రి వ్యవహార శైలిని పిల్లలు తప్పుపట్టేవారు. కుటుంబం మొత్తం తల్లికే అనుకూలంగా మాట్లాడటంతో కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో మంగళవారం భార్య హరమ్మ, పెద్దకుమారుడు తాతారావు (27), చిన్నకుమారుడు కామరాజు, చిన్నకుమార్తె ఈశ్వరమ్మ ఇంట్లో నిద్రపోతుండగా రాత్రి 11 గంటలు దాటాక కుప్పయ్య దాడికి దిగాడు. సరుగుడు, నీలగిరి తోటలు నరికే కత్తితో పెద్ద కొడుకు తాతారావును నిర్దాక్షిణ్యంగా నరికాడు. తలపై కత్తితో పలుమార్లు దాడిచేయటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు భయాందోళనతో కేకలు వేశారు. పెద్దకొడుకును నరికిన కత్తితోనే చిన్న కొడుకు కామరాజుపైనా దాడిచేశాడు. వెంటనే అప్రమత్తమై పరుగులు తీయటంతో గాయాలతో బయటపడ్డాడు. భార్య హరమ్మ, కుమార్తె ఈశ్వరమ్మ బయటకు వచ్చి కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు మేల్కొనడంతో కుప్పయ్య పరారయ్యాడు. అనంతరం స్థానికులు 108 అంబులెన్సు, పోలీసులకు సమాచారం అందించారు. సీఐ ఆదాం, ఎస్సై సత్యనారాయణ గ్రామానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. క్షతగాత్రుడు కామరాజును శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించి చికిత్స చేయించారు. తాతారావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. గ్రామంలో పోలీస్ పికెట్ నిర్వహించి శాంతిభద్రతలు పర్యవేక్షిస్తున్నారు.



సంఘటన స్థలంలో తాతారావు మృతదేహం (ఇన్‌సెట్లో) తాతారావు (ఫైల్)



గాయపడ్డ కామరాజు

---

## స్టీరింగ్ పట్టు.. ఉపాధి కొట్టు..



యంత్ర విడిభాగాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

- నిరుద్యోగ యువతకు అండగా ఏపీఎస్ ఆర్టీసీ
- డ్రైవింగ్‌లో శిక్షణ ఇస్తున్న వైనం
- ఇప్పటికే 12 బ్యాచ్‌లు పూర్తి
- శిక్షణ తీసుకుని ఉపాధి పొందుతున్న యువత

శ్రీకాకుళం అర్బన్: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ ఆర్టీసీ) అంటే ముందుగా గుర్తుకు వచ్చేది సురక్షిత, సుఖవంతమైన ప్రయాణం. ప్రయాణికుల సేవలోనే కాకుండా నిరుద్యోగ యువత బంగారు భవిష్యత్తుకు భరోసా కల్పించే విధంగా ఆసక్తి ఉన్న వారికి హెవీ వెహికల్ డ్రైవింగ్‌లో శిక్షణ ఇస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు సంస్థ అధికారులు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలోని వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువత భవిష్యత్తుకు భరోసా కల్పించేందుకు డ్రైవింగ్ స్కూళ్లను ఏర్పాటు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పార్లమెంటరీ నియోజకవర్గాల్లో ఆర్టీసీ హెవీ వెహికల్‌లో డ్రైవింగ్ పాఠశాలలను ప్రారంభించింది. ఇందులో భాగంగా జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం ఒకటో డిపో పరిధిలో హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ స్కూల్‌ను ప్రారంభించారు. అర్హత కలిగిన యువతీ, యువకులకు బ్యాచ్‌లను ఏర్పాటు చేసి డ్రైవింగ్‌లో శిక్షణ, వాహన చట్టం గురించి అవగాహన కల్పించడంలో 32 రోజుల పాటు శిక్షణ ఇస్తున్నారు. దీని కోసం నామమాత్రపు ఫీజును తీసుకుంటారు. శిక్షణ పూర్తి చేసుకున్నవారికి సర్టిఫికెట్‌తో పాటు హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్‌ను ఇప్పించి వారి జీవితానికి భరోసా కల్పిస్తున్నారు. ఇక్కడ డ్రైవింగ్ నేర్చుకుంటున్న అభ్యర్థులు భవిష్యత్తులో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో డ్రైవర్‌గా స్థిరపడేందుకు అవకాశం ఉంటుంది. ప్రభుత్వ రంగాల్లో అయితే ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ పొందిన వారికి ప్రాధాన్యం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

**జిల్లాలో ఇల్లా..**

జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం ఒకటో డిపో పరిధిలో 2020 అక్టోబర్ ఎనిమిదో తేదీన డ్రైవింగ్ శిక్షణ స్కూల్‌ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ 12 బ్యాచ్‌ల్లో 200 మంది శిక్షణ పొందారు. సమాజంలో నిరుద్యోగ యువత భవిష్యత్తుకు భరోసా కల్పించడం, డ్రైవింగ్‌లో మెలకువలు నేర్పి సమాజానికి అందించడమే శిక్షణ ముఖ్య ఉద్దేశమని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఈ నెలాఖరునాటికి 13వ బ్యాచ్ శిక్షణ సైతం ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే శిక్షణ పొందిన వారిలో చాలామంది డ్రైవింగ్‌ను వృత్తిగా చేసుకుని స్వయం ఉపాధి పొందుతూ కుటుంబాలకు అండగా ఉంటున్నారు.

### క్రమశిక్షణతో కూడిన శిక్షణ



హెవీ వెహికల్ డ్రైవింగ్‌లో అభ్యర్థులకు సుశిక్షితులైన నిపుణులచే శిక్షణ అందిస్తున్నాం. క్రమశిక్షణ, అంకితభావంతో డ్రైవింగ్‌లో మెలకువలు నేర్పిస్తున్నాం. రోజూ శిక్షణ అనంతరం ఒక గంట తరగతి గదిలో డ్రైవింగ్‌పై పాఠాలు, గ్యారేజీలో ఇంజిన్ విడిభాగాలపై అవగాహన కల్పిస్తున్నాం. యోగా, ధ్యానంలో కూడా శిక్షణ ఇస్తున్నాం.

– ఎ.విజయ్‌కుమార్, డీపీటీవో, శ్రీకాకుళం

### డ్రైవింగ్‌లో మెలకువలు నేర్చుకున్నా



డ్రైవింగ్‌పై మక్కువతో ఆర్టీసీలో హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ పొందాను. బయట అయితే కేవలం డ్రైవింగ్ మాత్రమే నేర్పుతారు. ఇక్కడ అనుభవం, సుశిక్షితులైన శిక్షకులచే చాలా మెలకువలు, ప్రమాదాల బారిన పడకుండా ఉండేవిధంగా డ్రైవింగ్ స్కిల్స్ నేర్పారు.

–డాక్టర్ నాగార్జున, జేమ్స్ మెడికల్ కళాశాల వైద్యుడు

### పూర్తిస్థాయిలో అవగాహన



ఆర్టీసీలో ఇచ్చే డ్రైవింగ్ శిక్షణ చాలా బాగుంది. డ్రైవింగ్‌లో మెలకువలతో పాటు బస్సు యంత్రాల విడిభాగాలు చూపడం, ఏవిధంగా డ్రైవింగ్ చేస్తే ఇంధనం ఆదా అవుతుంది, ఎటువంటి సమయాల్లో క్లచ్, బ్రేక్‌లను వినియోగించాలి తదితర వాటిపై క్షుణ్ణంగా అవగాహన కల్పిస్తున్నారు. హెవీ వెహికల్ లైసెన్స్ కూడా ఇప్పించారు.

–దినేష్, బీటెక్, ఎంబీఏ విద్యార్థి, శ్రీకాకుళం

### భరోసానిచ్చింది



ఆర్టీసీ హెవీ వెహికల్ డ్రైవింగ్‌లో ఇచ్చిన శిక్షణ జీవితంలో స్థిరపడతానన్న భరోసాను కల్పించింది. ఇక్కడ డ్రైవింగ్ తీసుకున్న నేను విశాఖపట్టణంలోని దిశ పోలీస్ స్టేషన్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాను. మట్టి, తారు, సిమెంటు, కంకర రోడ్లపై వర్షాకాలంలో ఏవిధంగా డ్రైవింగ్ చేయాలో క్షుణ్ణంగా నేర్పారు.

– ఎ.జనార్దనరావు, దిశ పోలీస్ స్టేషన్ డ్రైవర్, విశాఖపట్టణం

---

## పట్టపగలే దొంగలు పడ్డారు

ఎచ్చెర్ల క్యాంపస్: పట్టపగలే ఓ ఇంట్లోకి దొంగలు చొరబడి నగలు, నగదు అపహరించుకుపోయారు. ఈ సంఘటన 16వ నంబరు జాతీయ రహదారి పక్కన ఫరీదుపేట పంచాయతీ కొయ్యరాళ్ల కూడలిలో బుధవారం ఉదయం చోటుకుంది. దుర్గాలయం సమీపంలో ఉంటున్న బోడవరం నారాయణరావు మేడపై ఇంట్లో దొంగలు పడ్డారు. ప్రస్తుతం ఈ ఇంట్లో దంపతులైన నారాయణరావు, లక్ష్మి మాత్రమే ఉంటున్నారు. లక్ష్మి ఉదయం ఏడు గంటల సమయంలో నాతన్న చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులకు వెళ్లిపోగా.. నారాయణరావు ఎనిమిది గంటలకు ఇంటికి తాళం వేసి తను పనిచేస్తున్న కుశాలపురం నవభారత్‌లోని అల్యూమినియం పరిశ్రమకు వెళ్లిపోయారు. తిరిగి 9.30 గంటల సమయంలో అల్పాహారం చేసేందుకు నారాయణరావు ఇంటికి వచ్చి చూడగా తలుపు గడియలు పగల గొట్టి ఉండడంతో ఆందోళన చెందాడు. లోనికి వెళ్లి చూడగా రెండు బీరువాల్లోని దుస్తులన్నీ బయట పడేసి ఉన్నాయి. లాకర్‌లో ఉంచిన 13 తులాల బంగారం (గాజులు, నల్లపూసలు, గొలుసు), రూ. 1.60 లక్షల నగదు చోరీకి గురైనట్టు గుర్తించారు. వెంటనే ఎచ్చెర్ల పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. సీఐ ఆదం ఆధ్వర్యంలోని పోలీసులు, క్లూస్‌టీం సంఘటన స్థలానికి చేరుకుని క్షుణ్ణంగా పరిశీలించారు. పగల గొట్టిన గడియలు, బీరువా పరిశీలించిన క్లూస్‌టీం ప్రాథామిక ఆధారాలు సేకరించారు. దొంగతనంలో స్థానికుల ప్రమేయం ఏమైనా ఉందా.. లేక ఇతర ముఠాల పనా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా నారాయణరావు దంపతులు ఇటీవల వారం రోజులు తిరుపతి వెళ్లి వచ్చారు. ఆ సమయంలో ఎటువంటి సమస్య రాలేదు. అలాంటిది తాళం వేసి ఉన్న గంటన్నరలోపే చోరీ జరగడంతో బాధితులు విలపిస్తున్నారు.



చోరీ జరిగిన బీరువాను పరిశీలిస్తున్న క్లూస్ టీం